
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు
జిల్లా వార్తలు

5

ఆదివారం 24 నవంబరు 2024

ఎస్. కొండాపురం కొండల్లో టీడీపీ కూటమి నాయకులు తరలిస్తున్న ఎర్రగరుసు



కొల్లగొడుతున్నారు..!

ఆదోనిలో ఎర్రమట్టి మాఫియా

- కొండాపురంలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- అనుమతులు ముగిసినా తవ్వకాలు
- పర్యావరణ అనుమతి లేకుండానే గరుసు తరలింపు
- మరో 'కేజీఎఫ్'గా మార్చేసిన వైనం

ఆదోని రూరల్/కర్నూలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):

ఆదోనిలో ఎర్రమట్టి మాఫియా రెచ్చిపోతోంది. నాడు వైసీపీ నాయకులు.. నేడు కూటమి నాయకులు అధికారం మాటున కొండాపురం కొండలను కొల్లగొడుతున్నారు. రెవెన్యూ అధికారులు ఎన్‌వోసీ ఇచ్చారు.. మైనింగ్ అనుతులు ఇచ్చారనే సాకుతో ఇష్టారాజ్యంగా కొండల్ని పిండి చేస్తున్నారు. రోజూ వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లు ఎర్రమట్టి రవాణా చేస్తూ రూ.కోట్లలో సంపాదిస్తున్నారు. వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అండతో ఆ పార్టీ నాయకులు ఆదోని బైపాస్ రోడ్డు పక్కనే కొండల్ని హరించేశారు. అక్కడి నుంచి కొండాపురం కొండల్లో వాలిపోయారు. ప్రస్తుతం టీడీపీ కూటమి నాయకులు మేము సైతం అంటూ ఎక్స్‌కవేటర్లతో తవ్వేస్తున్నారు. తమ పంటపొలాలు నాశనం అవుతున్నాయని రైతు శ్రీనివాసులు కన్నీటి వేదనను రైతులకు గరుసు దొంగల బెడద శీర్షికన ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. గరుసు తవ్వకాలకు మైనింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారని టీడీపీ రాష్ట్ర నాయకురాలు గుడిసె కృష్ణమ్మ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అయితే అలాంటి అనుమతులు లేవు.. తాత్కాలికంగా ఇచ్చిన అనుమతులు కూడా నవంబరు 3వ తేదీకే ముగిశాయి అంటూ మైనింగ్ అధికారులు తేల్చిచెప్పారు. కొండపురం కొండల్లో గరుసు తవ్వకాలకు ప్రస్తుతం పర్యావరణ అనుమతులు (ఈసీ) లేవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేయడంపై చర్యలు తీసుకుంటామని మైనింగ్ అధికారులు స్పష్టం చేశారు. మొత్తం మీద ఆదోనిలో మాత్రం కూటమి నేతలు మరో కేజీఎఫ్ (కొండాపురం గ్రావెల్ ఫీల్డ్)కు తెరతీసి ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారు.



ఫిర్యాదు చేయడానికి వచ్చిన తల్లీకొడుకులు బోయ సరోజమ్మ, శ్రీనివాసులు

ఆదోని-ఎమ్మిగనూరు జాతీయ రహదారి-167 పక్కనే బైచిగేరి క్రాస్ రోడ్డు సమీపంలో రెవెన్యూ రికార్డుల్లో ఎస్.కొండాపురం గ్రామం ఉంది. 'ఎస్.కొండాపురం కొండలు' ఆదోని, బైచిగేరి, కపటి గ్రామాల మధ్య సర్వే నంబరు.1 పరిధిలో 768 ఎకరాల విస్తీర్ణంలో గరుసు నిల్వలు ఉన్నాయి. ఇక్కడి ఎర్రమట్టి, క్వారీ అక్రమార్కులకు అడ్డాగా మారింది. అధికారంలో ఎవరు ఉన్నా.. కొండాపురం కొండల్లో ఎర్రమట్టి కాసులు కురిపిస్తోంది. ప్రస్తుతం టీడీపీ నాయకులు అధికారం మాటున అనుమతులు ఉన్నాయంటూ ఎక్స్‌కవేటర్లతో తవ్వేస్తూ రవాణా చేస్తున్నారు. ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు ఎర్ర మట్టికి డిమాండ్ ఉంది. రోజుకు వందలాది టిప్పర్లు రవాణా చేస్తున్నారు. ఒక్కో టిప్పరు దూరాన్నిబట్టి రూ.5 వేలు నుంచి రూ.6 వేలకు పైగా విక్రయిస్తున్నారు. అక్రమ తవ్వకాలను అడ్డుకుని ప్రభుత్వ భూములు సంరక్షించాల్సిన రెవన్యూ, గనులు భూగర్భ వనరుల శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అండతో ఆనాడు ఎర్రమట్టి మాఫిమా పెట్రేగిపోతే.. ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ సహకారంతో ఎర్రగరుసు తవ్వకాలు చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

మిగతా 6లో...

యంత్రాల పరిశీలన



పరిశీలిస్తున్న కలెక్టర్

కర్నూలు అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధునాతన టెస్టింగ్ యంత్రాల ద్వారా పరీక్షలను నిర్వహించి నాణ్యమైన మద్యాన్ని అందించేలా చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శనివారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ల్యాబ్‌ను సందర్శించి పరిశీలించారు. కొత్తగా వచ్చిన టెస్టింగ్ పరికరాల ద్వారా అన్ని రకాల పరీక్షలు, టెస్టింగ్ పద్ధతులు, రిపోర్టులు పొందుపరిచే వివరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ డిస్టిలరీస్‌లో తయారయ్యే మద్యం నాణ్యతను, పరిమాణాన్ని పరిశీలించేందుకు ప్రభుత్వం యంత్రాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. వీటి ద్వారా మద్యం నాణ్యత, పరిమాణాన్ని టెస్టింగ్ చేయవచ్చన్నారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంత రావు, సూపరింటెండెంట్ సుధీర్ బాబు, కెమికల్ ఎగ్జామినర్ హరిత, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాఘవేంద్ర కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమంలో నాయకత్వ లక్షణాల పెంపుపై మండల విద్యాధికారులకు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల నుంచి ఎంఈఓలు, హెచ్‌ఎంలకు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ శ్యామ్యూల్‌పాల్ ఏర్పాట్లను పరిశీలించారు. నంద్యాల డీఈఓ పి.జనార్దన్ రెడ్డి హాజరై సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ విద్యా పరిశీలన అధికారి డాక్టర్ రఫీ, కల్లూరు ఎంఈఓ శ్రీనివాసులు, కే.సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు గుడ్‌న్యూస్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసినట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం తెలిపారు. ఈ మార్గదర్శకాల ప్రకారం పింఛన్ తీసుకుంటున్న కుటుంబ యజమాని మరణిస్తే.. వెంటనే అతడి భార్యకు వితంతు పింఛన్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కుటుంబ యజమాని మరణించిన వెంటనే అందుకు సంబంధించి తగిన ధ్రువపత్రాలు అందజేస్తే తదుపరి నెలలో పింఛన్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా మొదటి రెండు నెలలు పింఛన్ తీసుకోకపోయినా తర్వాతి నెలలో మూడు నెలల పింఛన్‌ను ఒకేసారి అందజేస్తామని తెలిపారు.

చెక్ డ్యాంకు ప్రతిపాదనలు ఇవ్వండి

- మంత్రాలయం వద్ద తుంగభద్రపై ఎస్ఈకి కర్నూలు నగరపాలక ఎస్ఈ లేఖ
- కర్నూలు నగరం తాగునీటికి 0.50 టీఎంసీలు కావాలి
- రూ.130-150 కోట్లు అవసరమంటున్న ఇరిగేషన్ ఇంజనీర్లు

కర్నూలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర ప్రజల తాగునీటి కోసం తుంగభద్ర నదిపై రాఘవేంద్ర మఠం సమీపంలో 0.50 టీఎంసీల సామర్థ్యంతో అలుగు లేదా చెక్ డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డికి కర్నూలు నగరపాలక సంస్థ ఎస్ఈ జి. రాజశేఖర్ లేఖ రాశారు. జలవనరుల శాఖ ఇంజనీర్లలో ఈ లేఖపై ప్రధానంగా చర్చ జరుగుతోంది. భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన మేరకు నీటినిల్వలు ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు అమృత్-2 కింద తుంగభద్ర, హంద్రీ నదులపై చెక్ డ్యాం నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు ఇవ్వాలని ఆ లేఖలో కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013లో ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో చిన్ననీటి పారుదల శాఖ మంత్రిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ తుంగభద్రపై చెక్‌డ్యాం, రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదించారు. అప్పటి ప్రభుత్వాన్ని ఒప్పించి మంజూరు చేయించారు. రాష్ట్ర విభజన తరువాత ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. తాజాగా తాగునీటి అవసరాల కోసం మళ్లీ చెక్ డ్యాం నిర్మాణం ప్రతిపాదన తెరపైకి రావడం కొసమెరుపు. అయితే కౌతాళం మండలం మేళిగనూరు, మంత్రాలయం సమీపంలో తుంగభద్రపై 0.28 టీఎంసీలతో రోడ్ కమ్ బ్యారేజీ నిర్మాణానికి కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించింది. నెల రోజుల క్రితం ఇదే విషయంపై కర్ణాటక మంత్రి ఒకరు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సహా పలువురు నాయకులు, ఇరిగేషన్ ఇంజనీర్లతో సమావేశం అయ్యారు. కర్ణాటక ప్రతిపాదనను జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించారు. తాజాగా.. కర్నూలు నగరం రాఘవేంద్ర మఠం వద్ద చెక్ డ్యాం నిర్మాణానికి శ్రీకారం చుడితే కర్ణాటక, తెలంగాణ ఒప్పుకుంటాయా..? అన్నది ప్రశ్నార్థకమే. కాగా.. తుంగభద్రపై చెక్ డ్యాం నిర్మాణానికి సుమారుగా రూ.130 నుంచి రూ.150 కోట్లు వరకు నిధులు అవసరం ఉంటుందని ప్రాథమిక అంచనా వేస్తున్నారు.

శ్రీశైలంలో భక్తుల సందడి



గంగాధరమండపం ఎదురుగా కార్తీక పూజలు చేస్తున్న భక్తులు, నిత్యకళారాధనలో కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన

శ్రీశైలం, నవంబరు 23 (ఆంధ్రజోతి): శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసంతో పాటు శని,ఆది సెలవు రోజులు కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఉత్తర మాడవీధి ప్రాంగణం వద్ద, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద దీపారాధనలను చేశారు. ఈ సందర్భంగా ధర్మపథంలో నిత్యకళారాధన ఆకట్టుకుంది. సాయంత్రం తిరుపతికి చెందిన సహస్ర అకాడమీ బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. వినాయక కౌత్వం, శివస్తుతి, శివకైవారం, ఓం నమఃశివాయ శివాయ నమ తదితర శైవగీతాలకు కళాకారులు నృత్యప్రదర్శన నిర్వహించారు.

బీసీల సంక్షేమానికి రూ.39 వేల కోట్లు

బలహీన వర్గాల పురోభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి ● బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత



6లో

జీవితం ఒక ప్రయోగశాల

- చదువుతోనే ఉన్నత స్థాయికి
- క్లస్టర్ వర్శిటీలో సినీ నటుడు సుమన్



సమావేశంలో మాట్లాడుతున్న సినీ నటుడు సుమన్

కర్నూలు అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కష్ట సుఖాలు, శ్రమతో సాగే మానవ జీవితం ఒక ప్రయోగశాల అని సినీ నటుడు సుమన్ అన్నారు. శనివారం నగరంలోని క్లస్టర్ యూనివర్శిటీలో యువతరంగ్-2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో ఏదో ఒక సమస్య ఉంటుందని, దాన్ని అధిగమించేందుకు మానసికంగా స్థిరపడాల్సిందేనని అన్నారు. కష్ట సుఖాల మధ్య మానవ జీవితాన్ని ప్రయోగంగా ముందుకు తీసికెళ్లాలని, అప్పుడే జీవితం విలువ తెలుస్తుందని అన్నారు. ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకున్నప్పుడే వాళ్ల శక్తి సమాజానికి తెలుస్తుందన్నారు. రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ నిర్దిష్ట లక్ష్యాన్ని పెట్టుకుని దాన్ని అధిగమించాలని సూచించారు. యలపర్తి రమణయ్య, కరీముల్లా పాటలు పాడారు. కల్చరల్, క్రీడా పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎస్ఎన్ బాషా, పీఆర్‌వో పార్వతి దేవి, ఏపీఆర్‌వో డాక్టర్ వింధ్యవాసిని, డాక్టర్ వై శ్రీనివాసరెడ్డి, అక్తర్ భాను పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది



మాట్లాడుతున్న జి.కబర్ది

ఓర్వకల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు రాజ్యాంగం ప్రత్యేక చట్టాలను రూపొందించిందని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి. కబర్ది అన్నారు. శనివారం ఓర్వకల్లు పొదుపు సంఘం కార్యాలయంతో పాటు, గుడుంబాయి తండా గ్రామంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలకు ఏవైనా సమస్యలు ఉంటే న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే న్యాయ సలహాలు, సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి, ఏపీ జాతీయ మహిళా కమిషన్ సభ్యులు షేక్ రోఖియ బేగం, డీఎల్ఎస్ఏ రిసోర్స్‌పర్సన్లు మనోహర్, హేమలత, ఓంబ్లిస్ గౌరవ సలహాదారులు విజయభారతి, ఎంపీడీవో శ్రీనివాసులు, సీడీపీవో అనురాధ, రూరల్ సీఐ చంద్రబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి 99వ జయంతి



పుష్పాలంకరణలో సత్యసాయి మందిరం

కర్నూలు కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మానవాళికి అందించిన సేవలతో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు కర్నూలు నగరంలో శనివారం ఘనంగా జరిగాయి. నగరంలోని నెహ్రూ నగర్‌లో ఉన్న సత్యసాయిబాబా మందిరంలో వారం రోజులుగా సత్యసాయి జయంతి వేడుకలు నిర్వహించారు. తెల్లవారుజామున ఓంకారం, సుప్రభాతంతో మొదలైన పూజలు రాత్రి 9 గంటల వరకు కొనసాగాయి. బాబా మందిరాన్ని, విగ్రహాలను ప్రత్యేక పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మతాలు వేరుకాదని, ఉన్నది ఒకే మతం.. మానవత్వం అని సత్యసాయి సమాజానికి సందేశమిచ్చారన్నారు. సేవలు, ఆధ్యాత్మిక బోధనలతో సత్యసాయి ప్రపంచానికి ఆధ్యాత్మిక గురువు అయ్యారన్నారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ పి. రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు.

పత్తి రైతుల గోడు పట్టించుకోవాలి

సీసీఐ నిబంధనలను సడలించాలి

రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం

7

బీసీ వసతి గృహాల మరమ్మతులకు రూ.కోటి కేటాయింపు : ఎంపీ బస్తిపాటి

ఈ పచ్చదనం ప్రమాదకరం..!



చూడటానికి పచ్చగా ఎంత అందంగా ఉందో కదా ఈ దృశ్యం. కానీ ఈ పచ్చదనం చాలా ప్రమాదకరమంటే నమ్మశక్యంగా లేదు కదూ. సుందరంగా కనిపిస్తున్న ఈ పచ్చదనమంతా గుర్రపుడెక్క. కోడుమూరు మండలంలోని అమడగుంట్ల గ్రామంలో ఉన్న నీటికుంట మొత్తం ఇలా గుర్రపుడెక్కతో నిండిపోయింది. నిజానికి ఇది ఎంతో ప్రమాదకరం. నీటి ప్రవాహం ఆగిపోయి కలుషితం కావడంతో పాటు.. గుర్రపుడెక్క నుంచి వచ్చే గాలి కూడా ప్రమాదకరమే అంటున్నారు పర్యావరణ నిపుణులు. అంతేకాదు ఈ పచ్చదనం దోమలకు నివాసాలుగా కూడా ఉంటాయి.

- కోడుమూరు రూరల్.

కష్ట జీవుల

గడ్డి పరుపు..!

వ్యవసాయ పనులపై ఆధారపడి జీవనం సాగించే కూలీలకు రోజువారీ పనులు లేనిదే పూట గడవని పరిస్థితి. ఎన్ని కష్టాలున్నా వారికి పల్లెటూరే ప్రపంచం. ఆ మట్టిమనుషులే వారి ఆత్మీయ బంధువులు. శనివారం కోసిగి మండలకేంద్రంలో పశుగ్రాసం ట్రాక్టర్లపై సుమారు 20 మందికి పైగా కూలీలు పనులన్నీ పూర్తి చేసుకుని సాయంత్రం వేళ ఇలా హాయిగా వెళ్తూ కబుర్లు చెప్పుకుంటూ ఇళ్లకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వారికి పశుగ్రాసమే పరుపుగా మారింది. - కోసిగి



సొంత ఊరికోసం..!



- ప్రభుత్వ కార్యాలయాల స్థల దాత
- 12 ఎకరాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు
- రెండెకరాల్లో పాఠశాల నిర్మాణం
- ఏటా వంద ఉచిత వివాహాలు



కేజీబీవీ పాఠశాల

తుగ్గలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సొంతూరికి సేవ చేయాలని ఎంతోమందికి ఉంటుంది. కానీ కొంతమందికి మాత్రమే ఆ అవకాశం దక్కుతుంది. ఆ కోవలోకే వస్తారు... తుగ్గలి మండల కేంద్రానికి చెందిన తుగ్గలి నాగేంద్ర. సొంతూరిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భూములను ఇవ్వడం, పేదలకు పెళ్లిళ్లు, మండలంలోని పేదలకు ఇంటి స్థలాలు... ఇలా సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకెళ్తున్నారు. తుగ్గలి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు ఇచ్చిన స్థలాలన్నీ ఆయనవే. ఎంపీడీవో, తహసీల్దార్, వ్యవసాయ, ఏపీవో, వెలుగు, హౌసింగ్, పశువైద్య కార్యాలయాలన్నీ ఆయన ఇచ్చిన స్థలాల్లో నిర్మించినవే. కేజీబీవీ నిర్మాణానికి రెండు ఎకరాలు కేటాయించిన ఘనత కూడా ఆయనదే. అంతేకాదు ఏకంగా 12 ఎకరాలు కొని పేదలకు పంచిపెట్టారు. అలాగే ప్రతి ఏటా వంద ఉచిత వివాహాలు చేస్తూ పేదల మనిషిగా పేరు తెచ్చుకున్నారు.

మండల కేంద్రమైన తుగ్గలికి చెందిన కుమ్మరి సుంకన్న రెండో కుమారుడు తుగ్గలి నాగేంద్ర. ఫ్యాక్షన్ నేపథ్యంలో తన చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయారు. అయినప్పటికీ తనను నమ్ముకున్న వారి కోసం బడుగు, బలహీన వర్గాల కోసం ప్రత్యర్థులకు ఏమాత్రం వెరవకుండా మండలంలోనే నిలబడిపోయారు. తాను సంపాదించిన దాంట్లో పేదల కోసం విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు.

670 మందికి సొంత స్థలం

పేదలకు కల్పించడం కోసం గ్రామం ఆనుకుని రూ.కోట్లు వెచ్చించి నాలుగేళ్ల క్రితం 12 ఎకరాలు కొన్నారు. అందులో 670 మంది పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు రిజిస్టర్ చేయించారు. ఆ స్థలాల్లో ఇళ్లు కట్టుకోవడానికి ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఆ స్థలాల వరకు సీసీ రోడ్డు వేయించారు.

కేజీబీవీకి రెండెకరాల స్థలం

మండలానికి కేజీబీవీ బాలికల పాఠశాల మంజూరు కావడంతో స్థలం ఇస్తే.. పాఠశాలను నిర్మిస్తామని ప్రభుత్వం చెప్పింది. దీంతో తుగ్గలి నాగేంద్ర స్పందించి రెండెకరాల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. దీంతో అక్కడ కేజీబీవీ పాఠశాల నిర్మించడంతోపాటు ఇంటర్ కాలేజీ కూడా నిర్మించారు.

పేదల కోసమే నా జీవితం



పేదరికంలో పుట్టి.. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని పెద్దల ఆశీస్సులతో ఈ స్థాయికి ఎదిగాను. నాకున్న దేవుడు ఇచ్చిన సంపదలో ఖర్చు చేస్తున్నాను. భవిష్యత్తులో పేదల కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తాను. ఏ సమయంలోనైనా ఆపదలో ఉన్నవారు వస్తే నా వంతు సహాయ సహకారాలు అందిస్తా.

- తుగ్గలి నాగేంద్ర

ప్రభుత్వ కార్యాలయాలకూ..

మండల కేంద్రమైన తుగ్గలిలో ఎంపీడీవో, తహసీల్దార్, వ్యవసాయ కార్యాలయం, ఏపీవో, వెలుగు, హౌసింగ్, పశువైద్య కార్యాలయాలకు స్థలాలను తుగ్గలి నాగేంద్ర ఇచ్చారు. ప్రధాన కూడళ్లలో రూ.లక్షల్లో విలువ చేసే స్థలాలు ఉన్నాయి. ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి స్థలాలు ఇచ్చి స్ఫూర్తిగా నిలిచారు.

శ్రీరామనవమికి ఉచిత వివాహాలు

ఏటా తుగ్గలిలో జరిగే శ్రీరామనవమికి పేద యువతీ యువకులకు ఉచితంగా వివాహాలు చేసి వారికి పట్టువస్త్రాలు అందిస్తుంటారు. ఏడాదిలో ఏరోజైన నాగేంద్ర ఇంటికి వెళితే పెళ్లి వస్త్రాలతోపాటు తాళిబొట్లు, మెట్టెలు కూడా తుగ్గలి నాగేంద్ర అందిస్తూ వస్తున్నారు. ఒకే రోజు దాదాపు వంద వివాహాలు చేసి ఆ రోజు అయ్యే ఖర్చునంతా భరిస్తున్నారు. ఇలా పెళ్లి చేసుకోలేని పేదలకు అండగా నిలుస్తున్నారు.



తుగ్గలిలోని స్త్రీశక్తి భవనం



నూతన వధూవరులతో తుగ్గలి నాగేంద్ర దంపతులు (ఫైల్)

కొల్లగొడుతున్నారు..!

(5వ పేజీ తరువాయి)



ఆదోని మండలం ఎస్.కొండాపురం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు.1 పరిధిలో 500 క్యూబిక్ మీటర్లు ఎర్రగరుసు తవ్వకాలకు 90 రోజులకు తాత్కాలిక అనుమతి (టీపీ) ఇచ్చిన మాట నిజమేనని గనులు, భూగర్భ వనరుల శాఖ డీడీ రవిచంద్ర తెలిపారు. అయితే ఆ అనుమతి గడువు ఈ నెల మూడో తేదీతో ముగిసింది. గడువు ముగిశాక పాత ఎన్‌వోసీ, టీపీ చిత్తుకాగితాలతో సమానం. అవి ఏమాత్రం చెల్లవని వివరించారు. ప్రస్తుతం ఎవరైనా గరుసు తవ్వకాలకు అనుమతులు కావాలంటే స్టేట్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్మెంట్ అథారిటీ (ఎస్ఈఐఏ) జారీ చేసే పర్యావరణ అనుమతులు (ఈసీ) తప్పనిసరిగా ఉండాలి. ఈసీ అనుమతులు లేకుండా ఎర్రమట్టి, ఇసుక తవ్వకాలు ఎట్టి పరిస్థితుల్లో చేపట్టకూడదని జాతీయ గ్రీన్ ట్రైబ్యూనల్ (ఎన్‌జీటీ) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ ఇందుకు విరుద్ధంగా ఆదోనిలో యంత్రాలతో ఎర్ర గరుసు తవ్వకాలను చేపడుతున్నారు. మైనింగ్ నిబంధనలు ఇంతస్పష్టంగా ఉంటే.. 20 రోజుల క్రితమే మైనింగ్ అధికారులు ఇచ్చిన తాత్కాలిక అనుమతి (టీపీ) గడువు ముగిసినా.. మాకు ఎన్‌ఓసీ ఉందని, మైనింగ్ అధికారుల పర్మిషన్ పేరిట ఎస్.కొండాపురం కొండల్లో ఎక్స్‌కవేటర్లతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఓ పక్క సీఎం చంద్రబాబు నాయకుడు మద్యం, మట్టి, ఇసుక జోలికి వెళ్లవద్దని ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులకు స్పష్టంగా చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం సీఎం ఆదేశాలను తెలుగుతమ్ముళ్లు ఏమాత్రం లెక్కచేయడం లేదు. ఈసీ క్లియరెన్స్, మైనింగ్ అనుమతులతో ఖజానాకు రాయల్టీ చెల్లించి ఎర్రమట్టి తవ్వకాలు, రవాణా చేస్తే ఎవరు కాదనరు. అధికారం ఉంది కాదని ఇష్టారాజ్యంగా కొండల్ని తవ్వేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రైతుల గోడు పట్టదా..?:

ఆదోని పట్టణం బండిమెట్ట ప్రాంతానికి చెందిన బీసీ వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన బోయ సరోజమ్మ, కుమారుడు బోయ శ్రీనివాసులుకు ఎస్.కొండాపురం రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నంబరు.116లో 3.40 ఎకరాలు పొలం ఉంది. మా పొలం పక్కనే కపటి గ్రామానికి చెందిన మాధవ్ ఎక్స్‌కవేటరుతో అక్రమంగా గరుసు తవ్వకాలు చేస్తూ నాలుగు టిప్పర్లు, నాలుగు ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నారు. గరుసు తవ్వకాలు వల్ల మా పొలం కోతకు గురవుతుందని చెప్పిన మా గోడు పట్టించుకోవడం లేదు.. గరుసు తవ్వకాలు ఆపేసి మాకు న్యాయం చేయాలంటూ తల్లికొడుకులు బోయ సరోజ, శ్రీనివాసులు శుక్రవారం రాత్రి తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సూచన మేరకు సబ్ కలెక్టరు మౌర్యభరద్వాజ్, తహసీల్దారు శివరాముడును కలసి ఫిర్యాదు చేశారు. రైతు గోడును ఆంధ్రజ్యోతి వార్తగా ప్రచురించింది. గరుసు తవ్వకాలు చేస్తున్న కపటి టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ మాధవ్.. టీడీపీ రాష్ట్ర నాయకురాలు గుడిసె కృష్ణమ్మకు సన్నితుడని స్థానికులు అంటున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అనుమతితో తవ్వకాలు చేస్తున్నారనే పట్టణంలో చర్చించుకుంటున్నారు. అక్రమ గరుసు తవ్వకాల వల్ల తన పొలం కోతకు గురవుతోందని, న్యాయం చేయాలంటూ వాల్మీకి(బీసీ) సామాజిక వర్గానికి చెందిన రైతు శ్రీనివాసులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. పదే పదే బీసీ కార్డు ఉపయోగించే నేతలకు అదే బీసీ రైతు గోడు పట్టదా? అంటూ పలువురు పేర్కొంటున్నారు.

మైనింగ్ పర్మిషన్ ఉంది



అనుమతులు తీసుకుని గరుసు తవ్వకాలు చేపట్టాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి చెప్పారు. ఆయన అనుమతితోనే టీడీపీ నాయకుడు మాధవ్‌కు ఎస్.కొండాపురంలో గరుసు తవ్వకాలు చేసుకోవాలని చెప్పాం. మాధవ్ పేరిట ఈ ఏడాది సెప్టెంబరు 5న మైనింగ్ అధికారులు టెంపరరీ పర్మిషన్ ఇచ్చారు. వైసీపీ హయాంలో పర్మిషన్‌తో తవ్వారో లేదో మాకు తెలియదు.. మేము మాత్రం పర్మిషన్ తీసుకొనే తవ్వకాలు చేస్తున్నాం. బీసీ మహిళా నాయకురాలిగా 20 ఏళ్లుగా కార్యకర్తల కోసం పోరాడుతున్నాను. అన్ని పర్మిషన్లు తీసుకొని తవ్వకాలు చేస్తున్నాం. నేను ఎట్టి పరిస్థితిలో అవినీతిని ప్రోత్సహించను.

- గుడిసె కృష్ణమ్మ, టీడీపీ నాయకురాలు, ఆదోని

తవ్వకాలకు అనుమతులు లేవు



ఆదోని మండలం ఎస్.కొండాపురం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు.1 పరిధిలో 500 క్యూబిక్ మీటర్లు గరుసు తవ్వకాలకు ఇచ్చిన తాత్కాలిక అనుమతి (టీపీ) గడువు ఈ నెల 3న ముగిసింది. ప్రస్తుతం ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అనుమతి లేకుండా గరుసు తవ్వకాలు చేయడం నేరమే అవుతుంది. విచారించి కఠిన చర్యలు తీసుకుంటాం. నేషనల్ గ్రీన్‌ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు పర్యావరణ అనుమతి (ఈసీ) ఉంటేనే గరుసు తవ్వకాలకు టెంపరరీ పర్మిషన్ ఇస్తారు. ఈసీ అనుమతి లేకుండా ఎవరికి అనుమతులు ఇచ్చే ప్రసక్తే లేదు.

- రవిచంద్ర, డీడీ, మైనింగ్ శాఖ, కర్నూలు

మహానందిలో 'కార్తీక' సందడి



మహానంది కోనేరులో భక్తులు

మహానంది, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం మహానందిలో కార్తీకమాసం సందర్భంగా శనివారం భక్తులు పోటెత్తారు. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు కార్తీకమాసం పురస్కరించుకుని మహానందీశ్వరస్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని కోనేర్లల్లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అసభ్యకర పోస్టుల ఎఫెక్ట్..!

చిత్తూరు పోలీసుల కస్టడీలో మహానంది వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్

చిత్తూరు అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజుపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన జగన్‌కృష్ణ చిత్తూరు రెండో పట్టణ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. సీఎం, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ గౌరవానికి భంగం కలిగించే విధంగా అసభ్యకర పోస్టు పెట్టాడంటూ ఈ నెల 10వ తేదీన టీఎన్ఎస్ఎఫ్ నేత గోకుల కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో నంద్యాల జిల్లా మహానంది మండలంలోని యు. బండపల్లెకు చెందిన జగన్ కృష్ణను 13వ తేది చిత్తూరు పోలీసులు అదుపులోకి తీసుకుని అదే రోజు కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం రిమాండ్ విధించింది. కర్నూలు జిల్లా నేతలు ఇచ్చిన ఫిర్యాదుపై కస్టడీకి తీసుకున్న మన్యం పార్వతీపురం జిల్లా పోలీసులు కోర్టులో హాజరుపరిచి బొబ్బిలి జైలుకు తరలించారు. కోర్టు అనుమతి మేరకు తిరిగి శనివారం అక్కడ నుంచి చిత్తూరు రెండో పట్టణ పోలీసులు కస్టడీకి తీసుకున్నట్లు సమాచారం. సోషల్‌మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడం వెనుక ఎవరైనా ఉన్నారా అన్న కోణంలో విచారించడానికి కస్టడీకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

మహానంది ఆలయ పర్యవేక్షకుడిగా శశిధర్‌రెడ్డి



మహానంది, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయ సీనియర్ అసిస్టెంట్ అంబటి శశిధర్‌రెడ్డికి దేవస్థానం పర్యవేక్షకుడిగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. గత 35 సంవత్సరాలుగా మహానంది దేవస్థానంలో వివిధ విభాగాల్లో పనిచేసిన శశిధర్‌రెడ్డికి సీనియారిటీ ప్రతిపాదికన పర్యవేక్షకుడిగా పదోన్నతి కల్పించినట్లు చెప్పారు. ఈమేరకు పలువురు ఆలయ సిబ్బంది ఆయనను అభినందించారు.

బీసీల సంక్షేమానికి రూ.39 వేల కోట్లు

బలహీన వర్గాల పురోభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి ● బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత



కర్నూలు కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమానికి రూ.29 వేల కోట్ల నిధులు కేటాయించిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని, రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల పురోభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అహరహం కృషి చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. శనివారం నగరంలోని నందికొట్కూరు రోడ్డులోగల ఆదర్శ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బీసీ శంఖారావం పేరుతో, వనభోజన మహోత్సవ రాష్ట్ర మహాసభను ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వర రావు యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సవిత మాట్లాడుతూ ఆనాడు ఎన్టీఆర్ బీసీలకు అన్ని రంగాలతో పాటు రాజకీయాల్లోనూ పట్టం కట్టడం వల్లే నేడు ఇలా వేదికలు ఎక్కగలుగుతున్నామని చెప్పారు. జిల్లా అభివృద్ధికి చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని రూ. వెయ్యి కోట్లతో డ్రోన్ హబ్ తీర్చిదిద్దబోతున్నారని అన్నారు. 33 శాతం చట్ట సభల్లో బీసీలకు అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. మరో అతిథి ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీసీ సంక్షేమానికి ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి రూ.2లక్షల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలు తమ పిల్లలకు తప్పనిసరిగా చదువు చెప్పించాలని సూచించారు. కర్నూలు, అనంతపురం ఎంపీలు బస్తిపాటి నాగరాజు, అంబికా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీసీలు ఎంతో నష్టపోయారని, ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీల సంక్షేమానికి పెద్దపీట వేశారని చెప్పారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ దేశ ప్రధానిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఒక్కసారైనా బీసీ సామాజిక వర్గం వారు కావాలని అన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఎన్ బాలాజీ, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, రాష్ట్ర టీడీపీ బీసీ విభాగం మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు తుగ్గలి నాగేంద్ర, కప్పట్రాళ్ల బొజ్జమ్మ, బత్తిని వెంకట్రాముడు, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకటశివుడు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం జేఏసీ చైర్మన్ వరప్రసాద్, కురువ, రజక కార్పొరేషన్ల చైర్మన్లు గోవిందప్ప, బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, విశ్రాంత ప్రిన్సిపాల్ బి. తిమ్మయ్య తదితరులు హాజరయ్యారు.



శంఖారావం కార్యక్రమానికి తరలివచ్చిన బీసీలు



వేదికపై ఐక్యతచాటుతున్న బీసీ నాయకులు, ప్రజాప్రతినిధులు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

బదిలీల్లో బాధితులు

- గృహ నిర్మాణ శాఖలో గందరగోళం
- ఉన్నతాధికారుల ఉత్తర్వులు చెల్లవట?
- సమస్యను నాన్చుతున్న అధికారులు

కర్నూలు, రాజ్‌విహార్ సర్కిల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా గృహనిర్మాణ శాఖ బదిలీల్లో గందరగోళం నెలకొంది. నెల రోజుల క్రితం జిల్లాలో జరిగిన వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల బదిలీలు ఆ శాఖ ఉద్యోగుల్లో అయోమయాన్ని సృష్టించాయి. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన గృహనిర్మాణ శాఖ పీడీ సిద్ధలింగమూర్తి దాదాపు 24 మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 11 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు, 13 మంది ఆపరేటర్లు ఉన్నారు. ఆ తరువాత ఆయన ఇక్కడి నుంచి మ్యాత శాఖకు బదిలీపై వెళ్లారు. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా బదిలీలు అయిన వెంటనే సంబంధిత ఉద్యోగులు తమకు నూతనంగా కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరి, దాదాపు 15 రోజుల పాటు అక్కడ పనిచేశారు. కొద్ది రోజుల తర్వాత ఈ బదిలీలు చెల్లవని, వీటిని అమలు చేయటం కుదరదంటూ కార్యాలయ వర్గాలు కొర్రీ వేసి, వారిని పూర్వ స్థానాలకే వెళ్లాలని ఆదేశించారు. దీంతో ఆ ఉద్యోగులు ఇబ్బందిపడుతున్నారు.

ఉన్నతాధికారుల ఉత్తర్వులు చెల్లవా?:

దీర్ఘకాలికంగా ఒకే స్థానంలో పాతుకపోయిన ఉద్యోగులను కదిలించటంతో పాటు, దూర ప్రాంతంలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులకు ఎంతో కొంత వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతో వారి విన్నపం మేరకు పీడీ ఈ బదిలీలను చేపట్టారు.



కానీ ఈ ఉద్యోగులకు ఉత్తర్వు కాపీలను అందజేసిన ఉన్నతాధికారులు, వాటిని బాధ్యులైన అధికారులకు అందజేయటంలో తాత్సారం చేశారు. ఆ తర్వాత పీడీ బదిలీ అయ్యారు. దీంతో సమస్య జటిలంగా మారింది. తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రానందున విధుల్లో చేర్చుకోలేమని ఉద్యోగులకు అధికారులు తేల్చి చెప్పారు. దీంతో బదిలీ అయిన ఉద్యోగులు పాత స్థానానికి దూరమై, కొత్త పోస్టులో చేరలేక నానా ఇబ్బందులు పడుతున్నా రు. వీరు చేరాల్సిన స్థానాలలో అప్పటికే ఉన్న సిబ్బంది అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక బదిలీ అయిన ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

నిర్మాణ దశలో ఉన్న గృహాల వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ సిబ్బంది (ఫైల్)

నాన్పుడు ధోరణితో నష్టం:

ఉద్యోగుల అభిప్రాయాలు, అవసరాలు, అభ్యర్థన మేరకు జరిగిన బదిలీల్లో సాంకేతిక తప్పిదంతో బదిలీ అయిన వాళ్ల త్రిశంకు స్వర్గంలో ఉండే పరిస్థితి ఏర్పడింది. వాళ్లను పాత, కొత్త స్థానాలకు తిప్పుతూ వేదనకు గురి చేస్తున్నారు. ప్రస్తుతం బాధ్యతల్లో ఉన్న ఉన్నతాధికారులు, కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తే సమస్య కొలిక్కి వస్తోంది. కానీ వారు ఏ నిర్ణ యం తీసుకోకుండా నాన్చివేత వైఖరితో ఉన్నారు. పీడీ పరిధిలో తేల్చాల్సిన అంశాన్ని కలెక్టర్ పేరుతో ఎటూ తేల్చడం లేదనే పలు విమర్శలకు తావిస్తోంది. దీని వల్ల గృహ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వంద రోజుల ప్రణాళిక లక్ష్యం నీరు గారుతోంది. ఉన్నతాధికారులంతా కలిసి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని వినతిపత్రాన్ని నివేదించటం కొసమెరుపు.

> **ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం**
>
> ఎన్టీయార్ గృహ నిర్మాణానికి సంబంధించి ఇంటింటి సర్వే ఇంకా అసంపూర్తిగా ఉండటంతో ఆ పనులు పూర్తికాగానే బదిలీల అంశాన్ని ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఇప్పటికే ఈ విషయమై ఇన్‌ఛార్జి పీడీ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే అర్హులైన వారందరికీ బదిలీలు జరిగేలా చర్యలు తీసుకుంటాం.
>
> \- మద్దయ్య, గృహనిర్మాణ శాఖ మేనేజర్, కర్నూలు

లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రచారం



మాట్లాడుతున్న జేసీ డా.బి. నవ్య

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారాన్ని ఈ నెల 25 నుంచి డిసెంబరు 23 వరకు నిర్వహించాలని శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య జిల్లా స్థాయి కోర్ కమిటీ సమావేశంలో అధికారులను ఆదేశించారు. జేసీ మాట్లాడుతూ లింగ వివక్షకు అవకాశం లేకుండా ఉండాలని పీఎన్డీటీ యాక్టును అమలు చేయడం జరుగుతోందన్నారు. అమ్మాయిలు 18 సంవత్సరాలు వయస్సు వచ్చేవరకు వివాహనం చేయరాదన్నారు. జిల్లా సమాఖ్య అన్ని మండల సమాఖ్యలు, అన్ని గ్రామాల సంఘాలు అందరూ స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్‌డీఏ పీడీ శివలీల, జాయింట్ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ రంగ లక్ష్మీదేవి, డీఐపీ ఆర్వో జయమ్మ, డీఈవో శ్యామూల్ పాల్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ శస్త్రచికిత్సపై వర్క్‌షాపు



నూతన ఈఎన్‌టీ వైద్యులకు శిక్షణ ఇస్తున్న డా. జయప్రకాష్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయిబాబా పుట్టిన రోజును పురస్కరించుకుని నగరంలోని ఎన్‌ఆర్‌పేటలో శ్రీసత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో 34వ హ్యాండ్స్ ఆన్ ఆసిక్యూల్ ప్లాస్టీ, టింపనో ప్లాస్టీ, మైక్రోఇయర్ సర్జరీ ఈఎన్‌టీ శస్త్ర చికిత్సపై రెండు రోజుల వర్క్‌షాపు శనివారం ప్రారంభమైంది. గత 15 సంవత్సరాలుగా ఈఎన్‌టీ శస్త్ర చికిత్స వర్క్‌షాపును శ్రీసత్యసాయి బాబా పుట్టిన రోజు సందర్భంగా ఏటా నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్ అధినేత డా. జయప్రకాష్ రెడ్డి తెలిపారు. వర్క్‌షాపులో ఈఎన్‌టీ శస్త్ర చికిత్సలపై నూతన వైద్యులకు శిక్షణతోపాటు వృత్తిపరమైన మెలకువలు అందిస్తారన్నారు. ఈఎన్‌టీ వైద్యులు డా.మహేంద్రకుమార్, డా. నదీమ్ (బెంగుళూరు), డా.ప్రవీణ్ కుమార్ రెడ్డి, డా. కుమార్ చౌదరి శిక్షణ అందిస్తారని తెలిపారు.

వసతి గృహాల మరమ్మతులకు రూ.కోటి కేటాయింపు



ఎంపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న డీబీసీడబ్ల్యూవో వెంకట లక్ష్మమ్మ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ హాస్టళ్లు, బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల మరమ్మతుల కోసం తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.కోటి కేటాయిస్తున్నట్లు ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రకటించారని డీబీసీడబ్ల్యూవో వెంకటలక్ష్మమ్మ అన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజులకు శనివారం పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమ హాస్టళ్ల స్థితిగతులపై చర్చించారు. నిధులు ప్రకటించిన ఎంపీకి డీబీసీడబ్ల్యూవో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లస్కర్ మృతి

నందికొట్కూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నంద్యాల రోడ్డులో ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ వద్ద లారీ కింద పడి లస్కర్ మృతి చెందారు. నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన పెద్ద చెంచు నాగన్న(52) జలవనరుల శాఖలో లస్కర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో ముచ్చుమర్రిలోని తన నివాసం నుంచి బియ్యం కొనుగోలు చేసేందుకు నందికొట్కూరుకు వచ్చారు. రైస్ మిల్లు వద్దకు వెళ్తుండగా ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ ఎదురుగా నంద్యాల నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో పెద్ద చెంచు నాగన్న అక్కడికక్కడే మృతి చెందారు. పెద్ద చెంచు నాగన్నకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ డిపో మేనేజర్లకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆపరేషన్ ఈడీ అప్పలరాజు

కర్నూలు రూరల్ నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో శనివారం కర్నూలు, నంద్యాల జిల్లాల డిపో మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్‌చార్జీలకు ఆపరేషన్‌పైన శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర కార్యాలయ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఆపరేషన్) అప్పలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణా తరగతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆపరేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు, రజియాసుల్తానా, నంద్యాల ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగానికి ప్రాధాన్యత

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎన్. బాలాజీ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎన్.బాలాజీ అన్నారు. శనివారం నగరంలోని వెంకటరమణ కాలనీ పున్నమి అతిథి గృహంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కర్నూలు డివిజన్ పరిధిలోని పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ప్రస్తుతం పర్యాటక ప్రదేశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, యూనిట్ మేనేజర్ సతీష్ పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

కర్నూలు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలో మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు వినయ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. డోన్ పట్టణం కొండపేటకు చెందిన వినయ్ కర్నూలు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 12 మోటారు సైకిళ్లు, ఒక ఆటో, నంద్యాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మోటారు సైకిళ్లను చోరీ చేశాడు. పోలీసులు నిందితున్ని అరెస్టు చేసి 12 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. శనివారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు : డీఎస్పీ



విద్యార్థినులను అభినందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన చదువులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని యు. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు ఫెన్సింగ్ క్రీడలో జాతీయ స్థాయికి వెళ్లడం అభినందనీయమన్నారు. రెండేళ్లుగా జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులలో యు.కొత్తపల్లి పాఠశాల ప్రథమ స్థానంలో నిలవడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని అన్నారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులను డీఎస్పీ అభినందించారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న యువకుడి కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో మృతిచెందిన ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

యువకుడి అనుమానాస్పద మృతి

- న్యాయం చేయాలని రోడ్డుపై కుటుంబ సభ్యుల ధర్నా

నందికొట్కూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని ఏబీఎం పాలెం కాలనీకి చెందిన ప్రవీణ్‌కుమార్(23) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామంలో ముచ్చుమర్రి గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన నిలిపిన ఓ వాహనంలో యువకుడి మృతదేహం ఉండడాన్ని స్థానికులు చూసి యువకుడి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. యువకుడి తండ్రి దేవదాను, తల్లి ఏస్తేరమ్మ, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో యువకుడి కుటుంబ సభ్యులు, బంధువులు రోడ్డుపై బైఠాయించారు. మూడు రోజుల నుంచి కనిపించడం లేదని చెప్పారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, పట్టణ సీఐ ప్రవీణ్ కుమారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని యువకుడి కుటుంబ సభ్యులతో చర్చించి న్యాయం జరిగేలా విచారణ చేపడతామని తెలిపారు. దీంతో ధర్నా విరమించారు. కర్నూలు నుంచి డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి పరిశోధించారు. జాగిలాలు కనిపెట్టిన జాడపై పోలీసులు విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పత్తి రైతుల గోడు పట్టించుకోవాలి



పెంచికలపాడు సీసీఐ కేంద్రం వద్ద రైతు సంఘం ప్రతినిధుల నిరసన

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంస్థ సీసీఐ పత్తి రైతుల ఇబ్బందులను ఏ మాత్రం పట్టించుకోకపోవడం దారుణమని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కల్పించుకుని కేంద్ర ప్రభుత్వం ద్వారా సీసీఐ పెడుతున్న నిబంధనలను సడలించేలా చూడాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కోరారు. శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు పెంచికలపాడులోని సీసీఐ కేంద్రం వద్ద ధర్నా చేపట్టారు. జగన్నాథం మాట్లాడుతూ నకిలీ విత్తనాల వల్ల పూర్తిగా దిగుబడి తగ్గిపోయి పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి సాగులో రైతులకు పెట్టుబడి ఖర్చులను పరిగణనలోకి తీసుకుని క్వింటానికి రూ.10వేల మద్దతు ధరను అందించేందుకు సీఎం చంద్రబాబు కేంద్రాన్ని ఒప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కృష్ణ నాయక్, పుల్లన్న, దొడ్డిపాడు బాషా, వెంకటేశ్వర్లు, రాముడు పాల్గొన్నారు.

నేడు 'జబర్దస్త్' కళాకారుల ప్రదర్శన

కర్నూలు కల్చరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు 'జబర్దస్త్' టీవీ కళాకారులతో హాస్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహ్మద్ మియా తెలిపారు. జబర్దస్త్ హాస్య కార్యక్రమంలోని టీవీ నటులు జబర్దస్త్ అప్పారావు, వినోదిని, గుండు మురళీధర్, నవీన్, అల్లరి అర్జున్, ఎస్ఎస్ ప్రసాద్‌లు ఈ హాస్య ప్రదర్శనలు ఇస్తారని వారు పేర్కొన్నారు.

పిల్లలకు వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న మలేరియా జిల్లా అధికారి నూకరాజు

కోడుమూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సెంటర్లలో 5 సంవత్సరాల వయస్సులోపు పిల్లలకు ఆరోగ్య సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. స్థానిక 18వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పిల్లలకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో, 18 సంవత్సరాలలోపు పిల్లలకు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో 44 రకాల ఆరోగ్య సమస్యలకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టి అవసరమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. అలాగే ప్రతి విద్యార్థికి 4డీఎస్ పుట్టుకతో వచ్చే లోపాలు, పౌష్టిక ఆహార లోపాలు, తరచుగా వచ్చే రోగాలు, వయస్సుకు తగ్గ శారీరక మానసిక పెరుదల, అంగవైకల్య లక్షణాలు, కౌమార దశలోని వచ్చే వ్యాధులను గుర్తించి అందుకు సంబంధించిన చికిత్సను అందిస్తామని చెప్పారు. అలాగే ఇంటింటికి తిరిగి 18 సంవత్సరాలు పైబడిన వాళ్లకు షుగర్, బీపీ, నోటి, రొమ్ము, సర్వేకల్ క్యాన్సర్ పరీక్షలను చేస్తామన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది నరసప్ప, కమాల్ సాహెబ్, ఆరోగ్య కార్యకర్తలు సుగుణమ్మ, అంగన్‌వాడి వర్కర్ సుశీలమ్మ పాల్గొన్నారు.

ఖాళీ ఉద్యోగాలపై శ్వేత పత్రం విడుదల చేయాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో ఖాళీ ఉద్యోగాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలు గడుస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ఉద్యోగాల భర్తీ గురించి ప్రజాప్రతినిధులు మాట్లాడకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు నిరాశగా ఉన్నారని తక్షణమే ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలపై శ్వేత పత్రం విడుదల చసి వాటి భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 6 నుంచి 9 వరక శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నగర అధ్యక్ష,కార్యదర్శులు బాబయ్య, బీసన్న, షాపిర్, చంటి పాల్గొన్నారు.

యువత ఓటును నమోదు చేసుకోండి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండుతున్న యువత ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో తమ ఓటును నమోదు చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శనివారం స్పెషల్ సమ్మరి రివిజన్-2025లో భాగంగా కర్నూలు అర్బన్ పరిధిలోని స్థానిక ఎస్టీబీసీ కళాశాలలోని 35, 36, 37, 38, 39, 40 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ డే (ప్రత్యేక ఓటరు నమోదు) కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల ముసాయిదా ఓటర్ల జాబితా-2025లో భాగంగా అక్టోబరు 29 నుంచి నవంబరు 28వ తేదీ వరకు తాత్కాలిక షిఫ్ట్, శాశ్వత షిఫ్ట్, డెత్ ఓటర్లకు సంబంధించి వచ్చిన క్లెయిమ్స్‌ను డిసెంబరు 24లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎస్టీబీసీ కలాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్.ప్రశాంతిసామ్ తదితరులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ పి .రంజిత్ బాషా

పోలింగ్ కేంద్రాల తనిఖీ

కోడుమూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి, కొత్తూరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్ శనివారం తనిఖీ చేశారు. స్పెషల్ సమ్మరీ రివిజన్-2025లో భాగంగా బీఎల్వోలకు తహసీల్దార్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు నమోదుతో పాటు తప్పులు లేని జాబితా తయారీకి కృషి చేయాలని తెలిపారు. వివాహం జరిగి వేరే ఊళ్లకు వెళ్లిన వారిని, మృతులను జాబితా నుంచి తొలగించాలని అన్నారు. వయసు, ఇంటి చిరునామా తప్పులుంటే అవగాహన కల్పిస్తూ సరిచేయాలన్నారు. ఆయా అవసరాలను బట్టి సంబంధిత ఫారాలు స్వీకరించాలని సూచించారు.

ప్రజా రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించాలి: డీఎస్పీ

ఓర్వకల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల విషయంలో ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ముందుండాలని కర్నూలు డీఎస్పీ జె.బాబు ప్రసాద్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్ఐని ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు గ్రామీణ సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ సునీల్ కుమార్ పాల్గొన్నారు.



స్టేషన్ రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ జె. బాబు ప్రసాద్

సమస్యల పరిష్కారానికి చర్యలు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు అన్నారు. శనివారం అధికారులతో కలిసి కల్లూరు ఎస్టేట్‌లో పర్యటించారు. కాలనీలో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ సమయంలో రహదారి గుంతలమయంగా మారిందని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సరఫరా మెరుగుపరచాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ క్రిష్ణలత, ఏఈలు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి తప్పనిసరి

● కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వేగవంతమైన పోటీ ప్రపంచంలో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి అంశాలు తప్పనిసరిగా అవసరమని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం స్థానిక యేలుకూరు బంగ్లా ఆవరణలోని నారాయణ పాఠశాలలో శనివారం మాస్టర్ ఒరేటర్ కాంటెస్ట్ పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ బస్తిపాటి నాగరాజు జ్యోతి ప్రజ్వలన చేసి వక్తృత్వ పోటీలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగాధిపతులు నరేష్, భారతి, రూప్కోస్, ఏఈజెం రమేష్ కుమార్, అన్వర్ బాసా, రామాంజనేయులు, క్లస్టర్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్స్, సాఫ్ట్ స్కిల్ డిపార్టుమెంట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు


సాంస్కృతిక కార్యక్రమాల్లో నారాయణ పాఠశాల విద్యార్థులు

'నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి'

కర్నూలు కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం నాయీ బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (నోపా) ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. నోపా ఉపాధ్యక్షుడు ఎస్ ధన విజయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు డీఎస్పీ ఎం. ఉపేంద్రబాబు, నోపా గౌరవాధ్యక్షుడు డాక్టర్ సి. నవీన్‌కుమార్, అధ్యక్షుడు ఎం. వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి ఎం. మద్దిలేటి, నోప బిల్డింగ్ మేనేజర్ ఎం. ఆంజనేయులు, నాయీ బ్రాహ్మణ అఖిల భారత నిత్యాన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు శివయ్య, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సంపత్‌కుమార్, సంఘ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ఎం. శాంతకుమార్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్ రాఘవేంద్ర, కళాకారుల సంఘం అధ్యక్షుడు రంగస్వామి పాల్గొన్నారు.


విద్యార్థినికి నోపా ప్రతిభా పురస్కారం అందజేస్తున్న నోపా నాయకులు

ధర్నాను జయప్రదం చేయండి

ఓర్వకల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి: రైతు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ 26న కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న పిలుపునిచ్చారు. ఓర్వకల్లు, హుస్సేనాపురం, నన్నూరు, లొద్దిపల్లె, భైరాపురం, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, ఎన్.కొంతలపాడు, గుట్టపాడు తదితర గ్రామాల్లో రైతు, కార్మిక సమావేశాలు నిర్వహించి, ధర్నా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండలాధ్యక్షుడు మధుసూదన్, వ్యకాసం మండల ఉపాధ్యక్షులు మల్లేష్, మాలిక్‌బాషా, సీఐటీయూ నాయకులు మాసుంబాషా, చంద్రశేఖర్, ఆంజనేయులు, జయరాముడు, ఇస్మాయిల్, రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు రూ.5లక్షల బీమా

గూడూరు నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలందరికీ ప్రమాద బీమా ఇన్సూరెన్స్ కింద రూ. 5 లక్షలు ఇస్తుందని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కె కృష్ణ అన్నారు. శనివారం గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామంలో కృష్ణ అధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్క కార్యకర్త సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకట్రాముడు, ఎంపీటీసీ మద్దిలేటి, హలీఫ్ బాషా పాల్గొన్నారు.


పెంచికలపాడులో సభ్యత్వ నమోదు చేయిస్తున్న కె కృష్ణ

టీటీడీ దర్శనానికి అనుమతివ్వాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో నేరుగా విభిన్న ప్రతిభావంతులకు దర్శనం కల్పించాలని కోరుతూ విభిన్న ప్రతిభావంతుల యువసేన అసోసియేషన్ శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం డైరెక్టర్ మల్లెల రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణుడు, రామాంజనేయులు, అంబన్న, హనుమంతప్ప, భాస్కర్, మస్తాన్‌వలి, జ్ఞానేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నదుల కాలుష్య నివారణపై ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ


ర్యాలీ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 76వ ఎన్‌సీసీ డేను పురస్కరించుకుని కర్నూలు గ్రూప్-1, ఆంధ్ర మెడికల్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం నదుల కలుషిత నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎన్‌సీసీ క్యాడెట్లు ర్యాలీ నిర్వహించారు. సంకల్ బాగ్ నుంచి ప్రకాష్‌నగర్, రోజా, ఎన్ఆర్‌పేట వరకు ర్యాలీ చేశారు. మున్సిపల్ పాఠశాల, సెయింట్ జోసెఫ్, కట్టమంచి రామలింగారెడ్డి పాఠశాలల ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్లు దాసరి సుధీర్, ప్రతాప్, రఘు, పీఐ స్టాఫ్ పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

సి. బెళగల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అధికారులు బాధ్యతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి శ్యామల అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజనం, కార్డులదారులకు అందజేసే నిత్యావసర సరుకులు సక్రమంగా అందేలా చూడాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారంగా అందజేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో రాణెమ్మ, వెటనరి డాక్టర్ ప్రవీణ్ ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25వ తేదీ వరకు అనంతపురం జిల్లా నార్పాలలో జరిగే 43వ సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొని పతకాలే లక్ష్యంగా దూసుకుపోవాలని జిల్లా ఒలంపిక్‌సంఘం కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి అవినాశ్ శెట్టి, షూటింగ్‌బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేఈ ప్రభాకర్ జన్మదిన వేడుకలు

కర్నూలు అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు కేఈ ప్రభాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేయించారు. జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఘనంగా పూలమాలలు, సన్మానంతో సత్కరించారు. ఈకార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా ఆధ్యక్షుడు కేఈ జగదీష్, డైరెక్టర్లు నంద్యాల నాగేంద్ర, షేక్ ముంతాజ్, ధరూర్ జేమ్స్, కార్పొరేటర్ పరమేష్, నాయకులు ఎస్కే బషీర్, సోమిశెట్టి నవీన్, పేరపోగు రాజు, అబ్బాస్, ఆదాం, బాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కేఈ ప్రభాకర్

నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

● కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు


ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కమిషనర్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం నగర పాలక పరిధిలోని 39వ వార్డు స్టాంటన్‌పురంలో నూతనంగా నిర్మించి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఎంపీతో పాటు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కమిషనర్ ఎస్. రవీంద్రబాబు, స్థానిక కార్పొరేటర్ సాంబశివ ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తున్నామన్నారు. నగరాన్ని స్మార్ట్ సిటీ దిశగా తీసుకెళ్లేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు.

అదానీని అరెస్టు చేయాలి


మాట్లాడుతున్న గౌసదేశాయ్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భారతదేశ గౌరవాన్ని మంట కలిపిన అదానీ గ్రూప్ కంపెనీ చైర్మన్ అదానీని అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌసదేశాయ్ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య కూడలిలో అదానీ అవినీతికి వ్యతిరేకంగా సీపీఎం అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. గౌసదేశాయ్ మాట్లాడుతూ సెకి నుంచి రాష్ట్ర డిస్కమ్‌ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకునేందుకు అదానీ గ్రూపులు భారీ ఎత్తున ముడుపులు చెల్లించిందన్నారు. రాష్ట్రం, దేశంలో అదానీ గ్రూప్‌తో ప్రభుత్వం చేసుకున్న అన్ని ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యూసిటి కార్యదర్శి రాముడు, సాయిబాబ, శ్రీనివాసులు, బీసన్న, నాగరాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి


మాట్లాడుతున్న జులకల్ సర్పంచ్ విద్యావతి

గూడూరు నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జులకల్ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ విద్యావతి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. శనివారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంపీపీ సునీత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో శివనాగ ప్రసాద్ నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను వివరించారు. జులకల్ గ్రామంలో ఫ్లోరైడ్ కారణంగా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పైపులైను నిర్మాణం చేపట్టి తాగునీటిని అందించాలని సర్పంచ్ కోరారు. సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సనా చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఏవో విజయసింహారెడ్డి, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వలంటీర్లను కొనసాగించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ,వార్డు వాలంటీర్లను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట వలంటీర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. వాలంటీర్లన కొనసాగిస్తూ రూ.10 వేలు వేతనాలు చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అసెంబ్లీలో మంత్రి చేసిన ప్రకటన ఉపసంహరించుకోవాలన్నారు. తక్షణమే వలంటీర్ల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా పాల్గొన్నారు.

నేడు రాజ్‌పుత్‌ల కార్తీక వనభోజనం

కర్నూలు కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా రాజ్‌పుత్ (బొందిలి) కుల బాంధవ్యుల యువజన సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు బి. రాఘవేంద్ర సింగ్, ఆర్. సాయిచరణ్ సింగ్, మనోహర్ సింగ్ తెలిపారు. నగరంలోని యునైటెడ్ కల్బ్ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, హైదరాబాదు గోశామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, విశిష్ట అతిథులుగా అగ్రసేని గ్రూప్స్ చైర్మన్ టీకే సింగ్ హాజరవుతారని వారు తెలిపారు.

కన్నుల పండువగా కార్తీక దీపోత్సవం




దీపాలను వెలిగిస్తున్న మహిళలు సామూహిక తులసి పూజలు చేస్తున్నభక్తులు

కర్నూలు కల్చరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలోని మూడో శనివారం సందర్భంగా నగరంలోని వివిధ శివ కేశవ ఆలయాల్లో ప్రత్యేక దీపోత్సవాలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం దీపాలు వెలిగించి, తులసి, లక్ష్మీ, దామోదర పూజలు చేపట్టారు. నగరంలోని వెంకటరమణ కాలనీలోని శ్రీ కమల్ రెసిడెన్సీలో మహిళలు సామూహిక కార్తీక దీపోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. శివ కేశవులకు ప్రీతికరంగా శంఖం, పద్మ పుష్పంలతోపాటూ వివిధ ఆకృతుల్లో ముగ్గులు వేసి వాటి మధ్య కార్తీక దీపాలను శోభాయమానంగా వెలిగించారు. అలాగే సామూహిక తులసి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

హొళగుంద, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వేలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. హొళగుంద మండలంలోని నాగరకన్వి గ్రామంలో గ్రామ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలు ఆయా గ్రామాల్లోనే పరిష్కరించేందుకే గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు తీసుకున్నారు. అంతకు ముందు సులువాయి, హొలగుందలోని(ఎన్‌యే)నాన్ అగ్రికల్చర్ స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆదోని డివిజన్ సర్వేయర్ వేణుసూర్య, తహసీల్దార్ ముకుంద రావు, వీఆర్వో సూరంజినేయులు, నాగరాజు పాల్గొన్నారు.

కేజీబీవీలలో మెరుగైన విద్య

● జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ స్నేహలత



మాట్లాడుతున్న డీసీడీవో స్నేహలత

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ విద్యాలయలలో బాలికలకు మెరుగైన విద్యను అందిస్తున్నామని జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ స్నేహలత అన్నారు. శనివారం నెహరా మెమోరియల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు కేజీబీవీలలో అందిస్తున్న ఇంటర్ కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీబీవీ విద్యాలయాల్లో పదో తరగతి పాసైన విద్యార్థినుల కోసం ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీలతోపాటు వృత్తి విద్యా నైపుణ్య కోర్సులను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. పేద విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగపడతాయని సూచించారు. మంచి విద్యతోపాటు పౌష్టికరమైన ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. పేద విద్యార్థినులు ఈ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సుధాకర్ ఉపాధ్యాయులు, కళ్యాణి, లోక్యానాయక్ ప్రసాద్ పాల్గొన్నారు.

గో రక్షకుడు..



ఆలయ ప్రాంగణంలో ఉన్న గోవులు



మద్దికెర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గో రక్షకుడిగా విజయ ప్రసాద్ యాదవ్ పేరు తెచ్చుకున్నాడు. మద్దికెర మద్దమ్మ కుంట సమీపాన వెలసిన సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో ఉంటున్న విజయ ప్రసాద్ రోడ్ల వెంబడి బక్కచిక్కిపోయిన 30 గోవులను తీసుకువచ్చి పోషిస్తు న్నాడు. దేవాలయ అభివృద్ధితోపాటు ఎంతో ఇష్టమైన గోవులను పెంచాలనే ఆలోచనతో మూడేళ్ల కిందట ఐదు గోవులను పెంచ డం మొదలు పెట్టాడు. వాటితో పాటు రోడ్ల వెంట తిరుగుతూ మేత లేక బక్కచిక్కిన ఆవులను తీసుకొచ్చి వాటి బాగోగులు చూసుకోవడం మొదలుపెట్టాడు. ఇలా అవి 30 గోవులయ్యాయి. వాటిని చూసుకుంటూనే ప్రతి మంగళవారం, అమా వాస్య, షష్ఠి, పౌర్ణమి రోజుల్లో సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం సాయం అందించాలని విజయ్ ప్రసాద్ యాదవ్ కోరుతున్నారు.

పరీక్షల భయం వద్దు

● జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య



భోజనాన్ని రుచి చూస్తున్న జాయింట్ కలెక్టర్

వెల్దుర్తి,/టౌన్ నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షలంటే భయం విడనాడాలని జాయింట్ కలెక్టర్ నవ్య అన్నారు. శనివారం వెల్దుర్తి మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల తరగతి గదుల్లోకి వెళ్లి వారితో ముచ్చటించారు. పుస్తకాలు తీసుకొని అందులోని ప్రశ్నలు విద్యార్థుల ను అడిగి సమాధానాలు రాబట్టారు. ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయు లను అడిగి తెలుసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల తరగతి గదులను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని స్వయంగా రుచిచూసి తనిఖీ చేశారు. పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోం దని, సొంత భవనం మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ నవ్యకు వెల్దుర్తి టీడీపీ యువనాయకుడు రమాకాంత్‌రెడ్డి తెలియజేశారు. అంతకుముందు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటక్ష్మి, తహసీల్దార్ చంద్రశేఖరవర్మ, పాఠశాల ప్రిన్సిపాల్ షబానాలు జాయింట్ కలెక్టర్ నవ్వకు పూలమొక్కలు అందజేసి స్వాగతం తెలిపారు.

హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

పత్తికొండ/తుగ్గలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి మండలంలో బాలుర, బాలికల బీసీ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని, ప్రతి రైల్వేస్టేషన్‌లో రైళ్లను ఆపేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి, తెలుగు రైతు ఉపాధ్యక్షులు మనోహర్ చౌదరిలు కోరారు. శనివారం కర్నూలులో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి తుగ్గలి మండల సమస్యలను విన్నవించారు. మంత్రి హాస్టల్స్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తిన లోక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సవిత, ఎంపీలను కలిసిన టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటపతి

ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

తుగ్గలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. శనివారం తుగ్గలిలో స్పెషల్ రివిజన్ సమ్మరి క్యాంప్‌ను తనిఖీ చేసి ఓటరు జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఉన్న తప్పు ఒప్పులను సరి చేయాలన్నారు. అలాగే 18 ఏళ్ల నిండిన కొత్త ఓటర్లకు ఓటు హక్కు కల్పించాలన్నారు. డబుల్ ఓటు ఉన్న వారిని వారి అనుమతితో ఒక ఓటును తొలగించాలన్నారు. అలాగే వివాహమై వెళ్లిపోయిన వారిని, చనిపోయిన వారి ఓటు జాబితాలో ఉంటే విచారణ చేసి తొలగించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో నవీద్‌పటేల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బెంచ్ కాదు హైకోర్టు ఏర్పాటు చేయాలి

పత్తికొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాయలసీమలో బెంచ్ కాకుండా హైకోర్టును ఏర్పాటు చేయాలని సీనియర్ న్యాయవాది ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాజధాని, హైకోర్టుల్లో ఏదీ కావాలో కోరుకునే హక్కు రాయలసీమ ప్రజలకు ఉందని అయితే.. శ్రీబాగ్ ఒడంబడికలను ఉల్లంఘించి రాయలసీమకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. బెంచ్ కాదని, హైకోర్టును ఏర్పాటు చేయాలని ఇది రాయలసీమ ప్రజల హక్కు అన్నారు. సీమ ప్రజల హక్కులను తుంగలో తొక్కి హైకోర్టును ఏర్పాటు చేయాల్సిన ఈ ప్రాంతంలో బెంచ్‌ను మాత్రమే ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం సమంజసం కాదన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

దేవనకొండ, నవండరు 23 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్, సీఐటీయూ నాయకులు నర్సారావ్ అన్నారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కనీసం వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, ఎనిమిది గంటల పని దినం హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలపై నిరసనగా పోరాటాలు చేయను న్నట్లు వారు తెలిపారు. ఈ నెల 26న కర్నూలు కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీరాములు, భాస్కర్, పాండు, నాగరాజు, యూసుఫ్‌బాషా, బలరాముడు పాల్గొన్నారు.

ఉల్లి, వెల్లుల్లి ధరలకు రెక్కలు





మద్దికెర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సామాన్యుడు ఏమీ తినేటట్లు లేదు.. ఏమి కొనేటట్లు లేదు. రోజు రోజుకు ఉల్లి, వెల్లుల్లి ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. కిలో వెల్లుల్లి రూ.480 కాగా ఉల్లిగడ్డలు కిలో రూ.60 పలుకుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ కేంద్రాల్లోకన్నా కిలో పైన రూ.5 నుంచి రూ.10 వరకు ఎక్కువగా ఉంటోంది. దీంతో సామాన్య ప్రజలు, కుటుంబీకులు వెల్లుల్లి వాడకుండా వదిలేస్తున్నారు. మద్దికెర, పెరవలి గ్రామంలో ఎక్కువ శాతం రిటైల్ వ్యాపారులే ఉన్నారు. మొన్నటి వరకు వెల్లుల్లి రూ.250లు ఉండగా.. ప్రస్తుతం రూ.480లకు చేరుకుంది. ఉల్లి ధర రూ.40ల నుంచి రూ.60లకు చేరింది. ఏదీ ఏమైనా సామాన్యులకు వెల్లుల్లి, ఉల్లి ధరలు కన్నీరు తెప్పిస్తున్నాయి. ప్రభుత్వం ధరలు తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ విజయం ఊహించిందే..

ఆదోని టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో బీజేపీ విజయం ఊహించిందే అని బీజేపీ ఓబీసీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు మోదీ మార్క్ పాలనకు స్వాగతం పలుకుతున్నారనడానికి మహారాష్ట్ర విజయమే నిదర్శనమని అన్నారు. ప్రజలు కేంద్రంలో ఎలాంటి అవినీతి మరకలేని నాయకుడిని కోరుకుంటున్నారని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే ఏ రాష్ట్రమైనా వేగంగా అభివృద్ధి కావడానికి అవకాశం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లోగా బీజేపీ మరికొన్ని రాష్ట్రాలలో ప్రజలకు దగ్గరవుతోందన్నారు.

నూర్పిడి యంత్రం పంపిణీ

ఆస్పరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బైలుపత్తికొండ గ్రామానికి చెందిన లక్ష్మన్న అనే రైతుకు ప్రభుత్వం మంజూరు చేసిన నూర్పిడి యంత్రాన్ని శనివారం మండల వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే వ్యవసాయ సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పరి రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ గోవిందు, టీడీపీ మండల ఉపాధ్యక్షులు కృష్ణమోహన్, రైతులు పాల్గొన్నారు.

29న జాబ్ మేళా

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు న్యాక్ కేంద్రం ఇన్‌చార్జి ఉలిగన్న తెలిపారు. ఆర్ట్స్ కళాశాల రహదారిలోని ఎంపీ యూపీ పాఠశాల న్యాక్ కేంద్ర ఆవరణలో ఉదయం 10 గంటలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. 10, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాకు సర్టిఫికెట్లతో రావాలని కోరారు. వివరాలకు న్యాక్ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

తలసేమియా బాధితులను ఆదుకుందాం

ఆలూరు అగ్రికల్చర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తల సేమియా బాధిత బిడ్డల కోసం ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బాలస్వామి అన్నారు. శనివారం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ 40మంది విద్యార్థులు తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేశారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డాక్టర్ జగదీష్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ రక్తదానంతో ఒకరి ప్రాణాలను కాపాడిన వారమవుతామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి జోనాథన్ ఎన్‌సీసీ అధికారి వెంకట్రాం రెడ్డి పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి సహకారం

మద్దికెర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథ స్వామి దేవాలయానికి తూర్పు రాజగోపురం నిర్మాణం కోసం స్థల కొనుగోలుకు అవసరమైన విరాళాలను గ్రామానికి చెందిన పలువురు అందించారు. మామిళ్ల రామకృష్ణ రూ.20 వేలు, మొలకలపెంట గ్రామానికి చెందిన తలారి దివాకర్, భార్య సులోచన రూ.20 వేలు, కొడితిని గ్రామానికి చెందిన కోనంటి సురేష్, భార్య సుజాత రూ.20 వేలు ఆలయ ఈవో వీరయ్యకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రంగస్వామి, సిబ్బంది రఘు ఉన్నారు.

పల్లెల అభివృద్ధే సీఎం ధ్యేయం

మద్దికెర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని టీడీపీ నాయకులు చెన్నకేశవులు, కొత్తూరు శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల పరిధిలోని బురుజుల గ్రామంలో రూ.18 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. బురుజుల గ్రామానికి ఎమ్మెల్యే రూ.28 లక్షలు మంజూరు చేయించారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పల్లెల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో నాయుడప్ప, రంగస్వామి, నాగభూషణం పాల్గొన్నారు.

వైభవంగా పడి పూజ

మద్దికెర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్దికెరలో అయ్యప్పస్వామి పడి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. శనివారం అయ్యప్ప మాలాదారులు అయ్యప్ప విగ్రహ పూజతో పాటు మెట్ల పూజ, పడి పూజలను గురుస్వాముల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులు స్వామివారికి పూజలు, అభిషేకాలు, కీర్తనలతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. అనంతరం అయ్యప్ప భక్తులు భిక్ష కార్యక్రమం నిర్వహించారు.



వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆలూరు ఎస్ఐ దిలీప్‌కుమార్

ఆలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా వేధింపుల కు గురి చేస్తే పోలీసులకు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని ఆలూరు ఎస్సై దిలీప్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఐద్వా ఆధ్వర్యంలో మహిళా భద్రత, అత్యాచారాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్ఐ మాట్లాడారు. సెల్‌ఫోన్, సినిమా ప్రభావంతో ఆకర్షణకు గురి కావొద్దన్నారు. చదువుకునే వయస్సులో ప్రేమ అనే మాయలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఎస్ఎఫ్ఐ నాయకులు షైనా, గోవర్ధన్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఆదోని రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులకు తహసీల్దార్ శివరాముడు సూచించారు. శనివారం తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి సాంబగల్లు ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులు తినే ఆహారాన్ని రుచి చూశారు. పిల్లలకు ప్రభుత్వ ఆదేశానుసారం భోజనాన్ని వండి పెట్టాలని, సిబ్బంది పర్యవేక్షణ తప్పనిసరి అని అన్నారు. అనంతరం 74వ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

తుగ్గలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. శనివారం తుగ్గలి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంచి విద్యతో పాటు భోజనాన్ని కూడా అందించాలన్నారు. కార్యక్రమంలో పీఈటీ చందు నాయక్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన

ఆదోని రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగుతోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు అన్నారు. శనివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ఉంటుందన్నారు. కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓబి నాగరాజు, వెంకన్న, కల్లుబావి రాజు, రామాంజనేయులు, భీమన్న, గుంటెప్ప, తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

ఆదోని రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని ఇస్వీ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం పెద్దహరివాణం, ఆదోనికి చెందిన ఇద్దరు వ్యక్తులు మట్కా రాస్తుండగా అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి రూ.20 వేలు నగదు, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

ఓటర్ నమోదు పరిశీలన

ఆస్పరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం ఆస్పరి, జోహరాపురం గ్రామాలలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న శనివారం పరిశీలించారు. శని, ఆది వారాలలో ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాల సందర్భంగా ఆమె ఆయా గ్రామాల్లో పాల్గొని నమోదు జాబితాను పరిశీలించారు. 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులు ఓటరుగా గుర్తింపు పొందాలంటే ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివశంకరన్ నాయక్, వీఆర్వో హరినాయక్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్లో విద్యార్థినులకు మౌలిక వసతులు కల్పించాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధనాపురం ఉదయ్ అన్నారు. శనివారం డీఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆర్ట్స్ కళాశాల వద్ద జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్లో విద్యార్థులకు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హాస్టల్ విద్యార్థుల పట్ల వార్డెన్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా హాస్టల్‌ను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

హైకోర్టు ప్రకటనపై హర్షం

ఆస్పరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయడం పట్ల టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉచ్చరప్ప యాదవ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణాకర్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాలోకేష్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం పలు అభివృద్ధి సంకేమ పథకాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో దశరథుడు, గోవిందు, గురుస్వామి పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి

పత్తికొండ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సర్వేలతో పని భారం ఒత్తిడి పెరిగిందని, పని భారం నుంచి తగ్గించేలా చూడాలని గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు కోరారు. శనివారం పలు గ్రామ సచివాలయాల వెల్ఫేర్‌లు ఎంపీడీవో సువర్ణలతకు వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న సర్వేలో సచివాలయ సిబ్బంది భాగస్వా ములు అయ్యేలా చూడాలని ఎంపీడీవోను కోరారు.

విద్యార్థుల సంఖ్య పెరిగింది

తుగ్గలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఉత్తమ విద్యను అందించడంతో పాటు పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉండటంతో విద్యార్థుల సంఖ్య పెరిగిందని, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, విద్యా కమిటీ చైర్మన్ శివకుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పెండేకల్ ప్రాథమికోన్నత పాఠశాలలో వారు మాట్లాడుతూ గత ఏడాది 3 నుంచి 8వ తరగతి వరకు 220 మంది విద్యార్థులు ఉండగా.. ఈ ఏడాది దాదాపు 36 మంది విద్యార్థులు అదనంగా చేరారని తెలిపారు. పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉండటంతో ఉత్తమ విద్య అందుతోందని తెలిపారు. భవిష్యత్తులో నూతన గదులు ప్రారంభమైతే విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

టీడీపీ మాజీ సర్పంచ్ మృతి

మంత్రాలయం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంట గ్రామ మాజీ సర్పంచ్ నరసమ్మ మృతి చెందారు. శనివారం విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు, మాధవరం మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి బాధిత కుటుంబానికి సంతాపం తెలిపారు. ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాగన్న, బీమపల్లి సుంకన్న, కురువ మల్లికార్జున, భీమయ్య, రమేష్, తాయన్న పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించొద్దు

నందవరం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది, అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఈవోపీ ఆర్డీ సందీప్ హెచ్చరించారు. శనివారం కైరవాడి గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, అలాగే ఫీల్డ్ విజిట్‌కు వెళ్లినప్పుడు ఖచ్చితంగా మూమెంట్ రిజిస్టర్‌లో రాసి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీవీ ఎంపికపై హర్షం: టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు


నందవరం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని ప్రజాపద్దుల కమిటీ(పీఏసీ) సభ్యుడిగా ఎంపిక కావడం హర్షణీయమని టీడీపీ మండల కన్వీనర్ డీవీ రాముడు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జీలు మాచాపురం కాశీం వలీ, ధర్మాపురం గోపాల్ అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 12మంది ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డిని సీఎం చంద్రబాబు ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. దీంతో నందవరంలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

గోనెగండ్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): 18 ఏళ్ల వయస్సు ఉన్న ప్రతి ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కుమార స్వామి సూచించారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో నూతన ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రాలను తహసీల్దార్ కుమార స్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో 18ఏళ్లు నిండిన వారు తప్పని సరిగా ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. సవరణ కూడా చేసుకునే అవకాశం ఉందన్నారు.


నందవరం: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేయించుకోవాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని మాచాపురం, నదికైరవాడి గ్రామాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ జర్మీయా పాల్గొన్నారు.

పొలాలపై గుర్రాల దాడులు



గోనెగండ్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లోని పంట పొలాలపై గుర్రాలు దాడుల చేస్తున్నాయి. గుర్రాలు పగలంతా వీధుల్లో వీరంగం సృష్టిస్తూ రహదారికి అడ్డంగా ఉంటూ పాదచారులకు, వాహనదారులకు ఇబ్బంది పడుతున్నారు. జనంపై దాడులు చేస్తున్నాయి. రాత్రి పూట రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంటను మొత్తం తినివేయడం, తొక్కి ధ్వంసం చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వేరుశనగ రైతులు కోరుతున్నారు.

రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ


రజిత గజవాహనం పై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రమణీయంగా సాగింది. శనివారం అష్టమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మఠం పండితులు, అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడముచ్చటగా బృందావనాన్ని అలంకరించారు. మహా మంగళహారతులు ఇచ్చారు.

రజిత గజవాహనంపై ప్రహ్లాదరాయల ఊరేగింపు

రాఘవేంద్ర స్వామి మఠంలో వెండి గజవాహనంపై ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలు భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం మఠం పండితులు రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పీఠాధిపతి మహామంగళహారతితో ఊరేగింపు సాగింది.

● రాఘవేంద్రస్వామి మఠానికి హైదరాబాదుకు చెందిన రాఘవేంద్ర చిలకలడోణ అనేభక్తుడు రూ.1.22లక్షలు సంపూర్ణ సేవకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. శనివారం కుటుంబ సమేతంగా ఆయన రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. దాత కుటుంబానికి శ్రీమఠం పండితులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో శ్రీపతి ఆచార్, నరసింహ దేశాయ్, శ్రీపాద ఆచార్‌లు పాల్గొన్నారు.

● మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పూర్వ పీఠాధిపతి కర్ణాటకలోని హంపిలో వెలిసిన రఘునందన తీర్థుల ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తన శిష్య బృందంతో కలిసి వెళ్లి రఘునంధనతీర్థుల బృందావనానికి ప్రత్యేక పూజలు, హారతులు ఇచ్చారు.

భూమిని రీ సర్వే చేయాలి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు కుటుంబం నిరసన


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న తిప్పనూరు రైతులు

గోనెగండ్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తమ భూమిని మరోసారి రీసర్వే చేసి అడంగల్‌లో ఎక్కించమని గ్రామ సచివాలయ ఉద్యోగులను అడిగితే లంచం ఇస్తే పని చేస్తామని చెబుతున్నారని తమకు న్యాయం చేయాలని తిప్పనూరు గ్రామ రైతులు మాదన్న, నల్లన్న, అయ్యస్వామి, మధు, కళ్యాణి. కన్నయ్య కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిప్పనూరు సచివాలయ ఉద్యోగులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జరిపిన రీసర్వేలో తమకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని కోరితే సచివాలయ ఉద్యోగులు డబ్బులు అడుగుతున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కుమార స్వామికి వినతి పత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు.

'రక్షణ లేని ప్రయాణం ప్రమాదకరం'

పెద్దకడబూరు, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): రక్షణ లేని ప్రయాణం ప్రమాదకరమని ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని ఎస్ఐ నిరంజన్ రెడ్డి సూచించారు. శనివారం పెద్దకడబూరులోని వాహనాలు తనిఖీ చేశారు. పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక ఎస్సీ కాలనీలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ తొమ్మిదో ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మార్పీఎస్ టౌన్ ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా మహిళా అధ్యక్షురాలు కదిరి కోట బతుకమ్మ, నాయకులు చార్లెస్, రామాంజనేయులు హాజరై జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఆదోని మండల అధ్యక్షుడు నరసప్ప, పురుషోత్తం, రోగెన్న, డేవిడ్, రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో చైతన్యం రావాలి


మాట్లాడుతున్న సీడీపీవో నాగమణి

కోసిగి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల నిర్మూలన కోసం విద్యార్థుల్లోనే వ ుుంద ు గా చైతన్యం రావాలని సీడీపీవో నాగమణి అన్నారు. శనివారం కోసిగిలోని కేజీబీవీ పాఠశాలలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 సంవత్సరాలు దాటక ముందు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో బాల్య వివాహాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యార్థులతో కలిసి సీడీపీవో నాగమణి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్టీటీ ఏరియా టీం లీడర్ కృష్ణయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయకుమారి, కాత్యాయని, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ మృతి


నాగరాజు (ఫైల్)

కోసిగి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 5వ వార్డుకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ముద్దమ్మగారి నాగరాజు (45) శనివారం ఉదయం గుండెపోటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆదోని ఆర్టీసీ డీఎం మట్టి ఖర్చుల కోసం రూ.15వేలు భార్య జయలక్ష్మి, కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు డ్రైవరు నాగరాజు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కనకదాసు జయంతిని జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో ఉన్న గ్లోబల్ ఇండస్ స్కూల్‌లో జరిగే కనకదాసు జయంతిని జయప్రదం చేయాలని టీడీపీ కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ కురువ సాధికార సమితి సభ్యుడు కేటీ వెంకటేశ్వర్లు కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో ఉన్న గ్లోబల్ ఇండస్ స్కూల్‌లో కనకదాసు జయంతి నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా చేనేత, జౌళీ శాఖమంత్రి సవితమ్మ, కర్నూలు, అనంతపురం ఎంపీలు బస్తిపాటి నాగరాజు, పార్థసారథి, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమానికి కురువ సంఘం నాయకులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వరికోత మిషన్‌లో పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుజాల గ్రామంలో వరికోత మిషన్‌లో పడి వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఒక రైతు పొలంలో వడ్లు కోయడానికి తమిళనాడు సేలం నుంచి మిషన్‌ను తీసుకొని రాగా శనివారం ఉదయం వడ్లు కోస్తుండగా మిషన్‌లో పడి మురగేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎమ్మిగనూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని రాగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

పగలే ఉచిత విద్యుత్ ఇవ్వాలి


డి.బెళగల్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏఈతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు, రైతులు

కోసిగి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గతంలో మాదిరిగా పగలే తొమ్మిది గంటల నిరంతరం ఉచిత విద్యుత్ రైతులకు అందించాలని రైతులు కోరారు. శనివారం రైతుల తరుపున టీడీపీ కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి విద్యుత్ ఏఈ వీరేష్‌ను కలిసి మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు రైతుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తున్నారని, ప్రస్తుతం కూడా పగలే తొమ్మిది గంటల విద్యుత్‌ను అందించి రైతులకు సహకరించాలని కోరారు. ఏఈ మాట్లాడుతూ రైతుల సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కేరళలోని వయనాడ్‌లో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ విజయం సాధించటంతో పాటు ఝూర్ఖండ్‌లో కాంగ్రెస్ కూటమి విజయం సాధించటంతో ఎమ్మిగనూరులో శనివారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఎమ్మిగనూరు ఇన్‌చార్జి కాశీం వలి ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కమ్మ సంఘం కార్తీక వన భోజనం

ఎమ్మిగనూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ శివారులోని విశాలగార్డెన్‌లో ఆదివారం కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం గౌరవాధ్యక్షుడు మహేంద్రబాబు, అధ్యక్షుడు భాస్కర్ తెలిపారు. వనభోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే సుజనా చౌదరి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, సినీ నిర్మాత వైవీఎస్ చౌదరి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, ఉమాపతి నాయుడు, ఏపీ కేఎస్ఎస్ బెజవాడ వెంకటరావులతో పాటు పలువురు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎమ్మిగనూరు ప్రాంత కమ్మ సోదరులు కుటుంబ సభ్యులతో కలిసి కార్తీక వనభోజన కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

శివారు కాలనీలపై చిన్నచూపు!

● అభివృద్ధికి నోచుకోని కాలనీలు
● ఇబ్బందుల్లో కాలనీల ప్రజలు

ఎమ్మిగనూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు కాలనీలపై ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తోంది. జనాభా రోజురోజుకూ పెరుగుతుండటంతో పట్టణం విస్తరించి శివారులో పలు కాలనీలు వెలిశాయి. అయితే కాలనీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు లేక ఆయ కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శివారు కాలనీల్లో ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించలేదు. పట్టణ శివారులో మైనార్టీ కాలనీ, మునెప్ప నగర్, రాధాకృష్ణ, న్యూ గణేష్ కాలనీ, టీబీపీ కాలనీ, మిలటరీ కాలనీ, ఎల్లమ్మ బీడు, సాయి కాలనీ, శివన్న నగర్, న్యూ ఎస్సీ కాలనీ, చంద్రయ్య కొట్టాల, కబరస్తాన్ కొట్టాల వంటి కాలనీలు వెలశాయి. అయితే అవసరమైన వసతులు కల్పించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మైనార్టీ కాలనీలో ఏళ్లు గడుస్తున్న కేవలం ఒకే ఒక సీసీ రోడ్డు మాత్రమే అధికారులు ఏర్పాటు చేశారు. మిగతా కాలనీ అంత మట్టిరోడ్లే ఉన్నాయి. మునెప్ప నగర్ అక్కడక్కడ మాత్రమే అరకొర సీసీ రోడ్లు ఏర్పాటు చేసి వదిలేశారు. రాధాకృష్ణ కాలనీలోకి వెళ్లాలంటే మట్టిరోడ్డు గతి. కనీసం ఇక్కడ గరుసురోడ్డు కూడా లేకపోవటం దారుణం. ఇక గణేస్ కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారి బీటీ రోడ్డు వేశారు. కాలనీలో సీసీరోడ్లు ఏర్పాటు చేయకపోవటంతో కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే మిలటరీ కాలనీ, సాయి నగర్, శివన్న నగర్, వైఎస్ఆర్ కాలనీల్లో మచ్చుకైనా సీసీ రోడ్లు కనిపించవు. ఎల్లమ్మ బీడుకాలనీలో మట్టిరోడ్డే దిక్కు. కబరస్తాన్ కొట్టాల, చంద్రయ్య కొట్టాల కాలనీల్లో ఎప్పుడో వేసిన రోడ్లు రాళ్లు తేలి ప్రజల రాకపోకలకు అసౌకర్యంగా మారింది. సీసీ రహదారులు అటుంచితే డ్రైనేజీలు సైతం నిర్మించకపోవటంతో ఇళ్లలోని మురుగునీరు ఇళ్లముందే ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రజలు దుర్వాసనను భరించలేకపోతున్నారు. శివారు కాలనీల్లోని సాయినగర్, తిరుమల నగర్, గ్యాస్ గోడౌన్ వెనక ఉన్న కాలనీల ప్రజలకు తాగునీటి సరఫరా లేదు. సౌకర్యాలు కల్పించాలని అనేక సార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే శివారు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయలని ప్రజలు కోరుతున్నారు.


పట్టణ శివారులో ఉన్న మైనార్టీకాలనీకి వెళ్లే రహదారి దుస్థితి


సీసీ రోడ్డు లేని మైనార్టీకాలనీ


సీసీ రోడ్డు మిలటరీ కాలనీ


అధ్వానంగా రాధాకృష్ణ కాలనీ మట్టి రోడ్డు


మునెప్ప నగర్‌లో రహదారి దుస్థితి